

వాడివాసల్ వద్దే మోపును పట్టుకున్న యువకుడిని పైకి విసురుతున్న ఎద్దు

రంకేసిన ఎద్దులు

జోరుగా తిరుకానూరుపట్టి జల్లికట్టు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా వల్లం సమీపం తిరుకానూరుపట్టిలో సెయింట్ ఆంథోనియర్ పొంగల్ వేడుకల సందర్భంగా ఆదివారం ఉదయం నిర్వహించిన జల్లికట్టు సాహసక్రీడ ప్రేక్షకులకు గగుర్పాటు కలిగించింది. ప్రభుత్వ నియమనిబంధనల పాటింపుతో, పకడ్బందీ ఏర్పాట్లతో ఈ జల్లికట్టును తంజావూరు జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్ ప్రారంభించారు. ఈ జల్లికట్టు కోసం తంజావూరు, తిరుచ్చి, అరియలూరు, పుదుకోట తదితర ప్రాంతాల నుంచి 700 ఎద్దులను శనివారం రాత్రే వాటి యజమానులు తీసుకొచ్చారు. ఉదయం 8గంటలకు వాడివాసల్ నుంచి పరుగులు తీసిన ఎద్దులను అణచి వేసేందుకు 300 మందికి పైగా యువకులు ప్రయత్నించారు. ఎద్దులను అణచిన యువకులకు సైకిళ్లు, మిక్సీలు, బీరువాలు, ప్లాస్టిక్ మంచాలు, బంగారు, వెండి కాసులను కానుకగా ఇచ్చారు. ఈ పోటీల్లో పదిమంది యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరికి అంబులెన్స్‌లోని వైద్యులు చికిత్సలందించారు. మరికొందరిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ ఆశిష్‌రావత్, రెవెన్యూ అధికారి త్యాగరాజన్, తహసీల్దార్ ఇలక్కియా, తిరుకానూరు పట్టి బిషప్ దేవదాస్ ఇగ్నేషియర్ తదితరులు ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు.





కాంగ్రెస్ నేతలతో చర్చలు జరుపుతున్న డీఎంకే కమిటీ సభ్యులు

పది సీట్ల కోసం పట్టు

డీఎంకే కమిటీతో కాంగ్రెస్ నేతల చర్చలు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీట్లను కేటాయించే విషయమై డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో రెండు పార్టీల మధ్య ఆదివారం మధ్యాహ్నం జరిగిన తొలివిడత చర్చలు ముగిశాయి. ఈ చర్చల్లో కనీసం పది నియోజకవర్గాలనైనా కేటాయించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తొమ్మిది నియోజకవర్గాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ ఈ సారి అంతకు మించిన సీట్ల కోసం డీఎంకేపై ఒత్తిడి చేస్తోంది. ఈ విషయమై డీఎంకే సీట్ల కేటాయింపుల కమిటీతో చర్చించేందుకు ఢిల్లీ నుంచి సీనియర్ నాయకులు ముకుల్ వాస్నిక్, సల్మాన్ ఖుర్షీద్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి అజోయ్‌కుమార్ విచ్చేసారు. వీరితోపాటు టీఎన్‌సీసీ అధ్యక్షుడు అళగిరి, సీఎల్పీ నేత సెల్వపెరుంతగై, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సత్యమూర్తి భవన్‌లో చర్చలు జరిపారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులు, ఏయే లోక్‌సభ నియోజకవర్గాలు పార్టీకి అనుకూలంగా ఉన్నాయనే విషయాలపైనా సమగ్రంగా చర్చించారు. ఆ తర్వాత వీరందరూ తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి బయలుదేరి వెళ్లారు. డీఎంకే సీట్ల కేటాయింపుల చర్చా కమిటీ నాయకుడు ఎంపీ టీఆర్ బాలు, మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, పొన్ముడి, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎంపీలు తిరుచ్చి శివా, రాజా కాంగ్రెస్ నేతలను సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత గంటకు పైగా సీట్లపై చర్చలు జరిగాయి. ఆ సందర్భంగా ఈసారి తమకు పది సీట్లను కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు డీఎంకే కమిటీ సభ్యులను కోరారు. టీఆర్‌బాలు మాట్లాడుతూ... ఈ సారి కూటమిలో కొత్త పార్టీలు చేరే అవకాశం ఉండటంతో మునుపటి కంటే తక్కువ సీట్లనే కేటాయించే అవకాశం ఉందన్నారు. ఏది ఏమైనప్పటికీ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ ఈ విషయమై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు అళగిరి మాట్లాడుతూ... మునుపటిలా తొమ్మిది సీట్లను కేటాయిస్తే తాము ప్రతిపాదించే నియోజకవర్గాలను ఇవ్వాలని కోరారు.

టీఆర్ బాలు ఖండన...

సీట్ల కేటాయింపుల తొలివిడత చర్చల్లో టీఎన్‌సీసీ నాయకులు పార్టీ గెలిచేందుకు అవకాశాలున్న 21 నియోజకవర్గాలను సూచిస్తూ, వాటిలో కనీసం 15 సీట్లను కేటాయించాలని పట్టుబట్టినట్లు ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలను డీఎంకే ఎంపీ టీఆర్ బాలు ఖండించారు. రెండు పార్టీల మధ్య జరిగిన తొలివిడత చర్చలలో కూటమి గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలు గురించి, కాంగ్రెస్‌కు కేటాయించాల్సిన నియోజకవర్గాలు గురించి మాత్రమే చర్చించామని తెలిపారు.

చర్చలు సంతృప్తికరం...

సీట్ల కేటాయింపుపై డీఎంకే కమిటీతో జరిపిన చర్చలు సంతృప్తికరంగా కొనసాగినట్లు టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి ప్రకటించారు. చర్చల తర్వాత అన్నా అరివాలయం వెలుపల ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనే విషయంపై మలి విడత చర్చల తర్వాతే అధికారికంగా ప్రకటిస్తామన్నారు. పుదుచ్చేరి సహా 30 నియోజకవర్గాలలో డీఎంకే కూటమి గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహరచనలు గురించి కూడా డీఎంకే సీట్ల కేటాయింపుల కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు.

'ఆరుపడై వీడు'కు వృద్ధుల తీర్థయాత్ర ప్రారంభం

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన 'ఆరుపడై వీడు'కు వృద్ధుల తీర్థయాత్రను ఆ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు ప్రారంభించారు. స్థానిక ప్యారీస్ కార్నర్ రాసప్పచెట్టి వీధిలోని కందకోట్టమ్ ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో 207 మంది వృద్ధులు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టీటీడీసీ) బస్సుల్లో తీర్థయాత్రగా బయలుదేరారు. ఈ బస్సులను మంత్రి శేఖర్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మయిలమ్ బొమ్మపురం ఆధీనం వివజ్ఞాన బాలాయస్వామి, పేరూరు ఆధీనం శాంతలింగ మరుదాచల అడిగళార్, సిరవై ఆధీనం కుమార గురుబరస్వామి, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ మురళీధరన్, డిప్యూటీ కమిషనర్లు లక్ష్మణన్, పి.జయరామన్, రేణుకాదేవి, ఐ.ముల్లై తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... కుమారస్వామి కొలువైన తిరుప్పరంకుంద్రం, తిరుచెందూరు, పళని, స్వామిమలై, తిరుత్తణి, పళముదిర్‌చోలై ఆలయాలకు ఒకే పర్యటనలో సీనియర్ సిటిజన్లు దర్శించుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఈ యాత్రకు బయలుదేరినవారికి దుప్పట్లు, శాలువ, తువ్వాలు, సబ్బులు, టూత్‌పేస్ట్, అద్దం, కొబ్బరి నూనె, దువ్వెన తదితర వస్తువులు కలిగిన కిట్‌ను అందజేసినట్లు తెలిపారు. వీరితోపాటు దేవాదాయ శాఖ అధికారులు, ఆయా ఆలయాలకు చెందిన ఉద్యోగులు తోడుగా వెళతారని చెప్పారు. సాధారణంగా ఈ ఆరు దివ్యక్షేత్రాలకు వెళ్లేందుకు రవాణా ఖర్చులు సుమారు రూ.50వేలు ఖర్చవుతుందని, అయితే దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన ఈ అరుపడై ఆలయాల దర్శన యాత్రకు రూ.15,830ను ఛార్జీగా వసూలు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అరవైయేళ్ల దాటిన వృద్ధులకు ఉచితంగా ఈ ఆరు ఆలయాల దర్శన భాగ్యం కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

అయోధ్యకు కూడా...

అయోధ్య రామాలయాన్ని దర్శించాలనుకునే వారికి కూడా రవాణా సదుపాయం కల్పించేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందని, ఈ విషయమై ఇప్పటి దాకా ఎవరూ దరఖాస్తులు పంపలేదన్నారు. అయితే అయోధ్యకు వెళ్లే మార్గం వివరాలు అడుగుతూ తమ కార్యాలయానికి ఫోన్ చేస్తున్నారని చెప్పారు. ఇకమీద అయోధ్య రామాలయానికి యాత్రగా వెళ్లాలని దరఖాస్తులు సమర్పిస్తే ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



తీర్థయాత్ర బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు



పుదుచ్చేరి పర్యటనకు వెళుతూ మీనంబాక్కం విమానాశ్రయం చేరుకున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్‌కు ప్రభుత్వం తరపున స్వాగతం పలుకుతున్న మంత్రి దామో అన్బరసన్, మేయర్ ఆర్ ప్రియ తదితరులు

స్పెయిన్‌లో స్టాలిన్‌కు అపూర్వ స్వాగతం

● పారిశ్రామికవేత్తలతో భేటీ

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం ఆదివారం మధ్యాహ్నం స్పెయిన్‌కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. స్పెయిన్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు నిర్వాహకులు, భారత రాయబార కార్యాలయం ఉన్నతాధికారులు, అక్కడి తమిళ సంఘం ప్రముఖులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. శనివారం రాత్రి 10గంటలకు చెన్నై నుంచి ఎమిరేట్స్ విమానంలో బయలుదేరి వెళ్లిన స్టాలిన్ ఆదివారం ఉదయం దుబాయ్ చేరుకున్నారు. రెండు గంటలపాటు అక్కడి స్టార్ హోటల్‌లో విశ్రాంతి తీసుకున్న తర్వాత మళ్లీ విమానంలో బయలుదేరి స్పెయిన్ చేరుకున్నారు. ఆయనతోపాటు సతీమణి దుర్గా స్టాలిన్, పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి అరుణ్‌రాయ్ తదితరులు స్పెయిన్‌లో బస చేశారు. ఆదివారం రాత్రి అక్కడ భారీ ఏర్పాట్ల నడుమ నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రసంగించారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అందజేస్తున్న రాయితీలు, సింగిల్ విండో లైసెన్సింగ్ జారీ గురించి సమగ్రంగా వివరించారు. ఆ తర్వాత స్పెయిన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోహా, గెస్టరామ్ గ్రూపు కంపెనీల ప్రతినిధులతోనూ, ఇన్వెస్ట్‌స్పెయిన్ అనే సంస్థ సభ్యులతోనూ ఆయన చర్చలు జరుపనున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

కుట్రాలం విహారయాత్రలో విషాదం

కారును ఢీకొన్న లారీ ● ఆరుగురి మృతి

పెరంబూర్, జనవరి 28: తెన్‌కాశి సమీపంలో కారును సిమెంట్ బస్తాల లోడు లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. తెన్‌కాశి జిల్లా పులియాంగుడి భగవతిఅమ్మన్ ఆలయ ప్రాంతానికి చెందిన కార్తీక్(22), పోతిరాజ్(28), సుబ్రమణియన్(27), వేల్‌మనోజ్(29), ముఖేష్(27) స్నేహితులు. వీరంతా భవన నిర్మాణ కార్మికులు. సెలవుల నేపథ్యంలో ముఖేష్ సోదరి భర్త ముత్తమిళ్‌సెల్వన్(27) స్వగ్రామానికి వచ్చాడు. వీరందరూ కలిసి శనివారం కుట్రాలం జలపాతానికి విహారయాత్రగా వెళ్లారు. యాత్ర ముగించుకొని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో ఆ కారు పులియంగుడి భగవతి అమ్మన్ ఆలయ ప్రాంతం రహదారిలో వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి కేరళ రాష్ట్రానికి సిమెంటు బస్తాలతో వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణించిన ఆరుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న తెన్‌కాశి ఎస్పీ సురేష్‌కుమార్, పులియాంగుడి డీఎస్పీ వెంకటేష్ సిబ్బందితో, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని, కారు శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీసి తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన తిరువణ్ణామలై జిల్లా మురుగపాడికి చెందిన లారీ డ్రైవర్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది.



మృతుల ఫైల్‌ఫొటోలు

దంపతుల మృతి...

సేలం జిల్లా మేట్టూరు సమీపం కుంజాండియూర్ పుదూర్‌కు చెందిన అలగేశన్ (29)-ఇళమతి (25) దంపతులు కుమారుడు కిషోర్ (5), కుమార్తె తిరుమతి (2)తో కలసి మోటర్ సైకిల్‌పై పన్నవాడిలోని బంధువుల ఇంటికి బయల్దేరారు. రమణ్‌నగర్ ప్రాంతంలో వస్తున్న మోటర్‌సైకిల్‌ను వెనుకనుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో భార్యా, భర్తలిద్దరూ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. కరుమలైకూడల్ పోలీసులు చిన్నారులను మేట్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రూ.23 కోట్ల మాదకద్రవ్యాల స్వాధీనం

అడయార్, జనవరి 28: నగరంలో రూ.23 కోట్ల విలువైన మాదకద్రవ్యాన్ని మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక విభాగం ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ డ్రగ్‌ను చెన్నై హార్బరులో ఉన్న ఓ కంటైనర్ నుంచి చోరీ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అయితే, ఈ కంటైనర్‌లో డ్రగ్ ఎక్కడ నుంచి ఎక్కడకు పంపించేందుకు లోడింగ్ చేశారన్న అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. చెన్నైలో మాదకద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో అడిషినల్ డీజీపీ మహేష్ కుమార్ అగర్వాల్ ఆదేశం మేరకు ప్రత్యేక బృందం మఫ్టీలో నగరంలోని పలు ప్రాంతాల్లో నిఘా సారించింది. ఈ బృందం తిరువొత్రియూరుకు చెందిన నీలమేఘన్, విల్లివాక్కంకు చెందిన సంషుద్దీన్ డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆ తర్వాత తమకు కూడా డ్రగ్ కావాలంటూ మఫ్టీలో సంప్రదించి, నీలమేఘన్ వద్ద 25 కిలోలు, సంషుద్దీన్ వద్ద 68 కిలోలు కొనుగోలు చేశారు. దీని డ్రగ్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.23 కోట్లని అడిషినల్ డీజీపీ మహేష్ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. ఆ తర్వాత నీలమేఘం, సంషుద్దీన్‌ను అరెస్టు చేసి, విచారణ జరిపారు. గతంలో హార్బరులో డ్రైవర్లుగా పనిచేశారనీ, అక్కడి కంటైనర్‌లో డ్రగ్‌ను చోరీ చేసి, నగరంలో విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

మైమరపించిన పంచరత్న కీర్తనల ఆలాపన

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞాన వేదిక తొట్టతొలుతగా నిర్వహించిన త్యాగరాజ ఆరాధన మహోత్సవం సంగీత ప్రియులను ఆద్యంతం మైమరపించింది. త్యాగరాజస్వామి పంచకరత్న కీర్తనలను ప్రముఖ గాత్రవిద్వాంసురాలు కమలికుమారితోపాటు 25 మంది కళాకారులు ఒకే వేదికపై ఆలపించడం విశేషం. తొలుత వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేస్తూ... ఇప్పటివరకూ తమ సంస్థ కరోనా సంక్షోభ సంవత్సరాల మినహా ప్రతినెలా తెలుగు సాహిత్య సంగీత కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తోందని చెప్పారు. తిరువయ్యారులో నిర్వహించే త్యాగరాజ ఆరాధనను నగరంలోని సంగీత ప్రియులు కూడా ఆస్వాదించే రీతిలో తొలిసారిగా పంచరత్న కీర్తనల ఆలాపనను నిర్వహించామన్నారు. వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి ... కమలికుమారిని, వయోలిన్ విద్వాంసురాలు పద్మశ్రీ అవసరాల కన్యాకుమారిని శాలువలతో జ్ఞాపికతో సత్కరించారు. ఇక త్యాగరాజ ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న కమలికుమారి ఐదు దశాబ్దాలపాటు కర్నాటక సంగీతంలో ఆరితేరిన గాత్ర విద్వాంసురాలు. పదేళ్ల ప్రాయంలోనే ప్రముఖ వాయులీన విద్వాంసుడు శీనివాసన్, కర్ణాటక సంగీత దిగ్గజాలు డీకే జయరామన్, ఎస్.రాజమ్ వద్ద శిక్షణ పొందారు. నేదునూరి కృష్ణమూర్తి అన్నమాచార్య కీర్తనలపై నిర్వహించిన పలు సదస్సుల్లో పాల్గొన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో బీకామ్ పట్టాను పొందిన తర్వాత న్యూఢిల్లీ గంధర్వ విద్యాలయం నుంచి సంగీతంలో డిగ్రీని సంపాదించారు. ఇక వయోలిన్ విద్వాంసురాలు పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి కూడా వాయులీనంలో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, కలైమామాణి అవార్డును పొంది, ఆకాశవాణి టాప్ ర్యాంక్ సంగీత వాద్య కళాకారిణిగాను పేరు గడించారు. తిరుపతి త్యాగరాజ ఉత్సవ కమిటీ ఆమెకు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదును ప్రదానం చేసి సత్కరించింది. 2004లో ఆమె లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ మేటి సంగీత విద్వాంసులు సంయుక్తంగా పంచరత్న కీర్తన ఆలాపనలో పాలుపంచుకున్నారు. నాట రాగంలో జగదానంద కారక, గౌళ రాగంలో దుడుకు గల, ఆరభి రాగంలో సాధించెనే, వరాళి రాగంలో కనకన రుచిరా, శ్రీరాగంలో ఎందరో మహానుభావులు అనే పంచరత్న కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి శ్రోతలందరినీ మైమరపింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్కా మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్య, టీటీడీ సలహా మండలి సభ్యులు అనిల్ కుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చివరగా అందరికీ ప్రసాదాల పంపిణీ జరిగింది.





పంచరత్న కీర్తనలను ఆలపిస్తున్న కమలికుమార్ బృందం కళాకారులు - కార్యక్రమానికి విచ్చేసిన సంగీత ప్రియులు

సమాచార ధ్వని

1 నుంచి పెరగనున్న బీరు ధరలు

ఐసిఎఫ్, జనవరి 28: అన్నిరకాల బీరు ధరలు రూ.10 పెరగనున్నాయి. ఈ పెంపు ఫిబ్రవరి 1వ తేది నుంచి అమల్లోకి రానుంది. టాస్మాక్ దుకాణాల్లో ప్రస్తుతం 35 రకాల బీర్లు, 13 రకాల వైన్ విక్రయస్తున్నారు. ఉన్నత మద్యం రకాలు లైట్ దుకాణాల్లో విక్రయమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, మద్యం ధరలను క్వార్టర్‌కు రూ.10 పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ధరల పెంపు ఫిబ్రవరి నుంచి అమల్లోకి వస్తుందని టాస్మాక్ అధికారులు తెలిపారు. ఆ ప్రకారం, బ్రాంది, విస్కీ, రమ్, జిన్, ఓడ్కా వంటి సాధరణ మద్యం రకాల ధర ఆఫ్ బాటిల్ రూ.20, ఫుల్ బాటిల్ రూ.40, ప్రీమియం మద్యం సీసాలు క్వార్టర్ బాటిల్ రూ.20, ఫుల్ బాటిల్ రూ.80, అన్ని రకాల బీరులపై రూ.10 పెరగనున్నాయి.

నేడు కడలూరులో ఉప రాష్ట్రపతి పర్యటన

ఐసిఎఫ్, జనవరి 28: భారత ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్‌కర్ ఒక రోజు పర్యటన నిమిత్తం సోమవారం కడలూరుకు విచ్చేస్తున్నారు. కడలూరు జిల్లాలోని సుప్రసిద్ధ ఆలయాలను ఆయన దర్శించనున్నారు. తిల్లై నటరాజ ఆలయం, బాబాజీ ఆలయం, ఎల్లయమ్మన్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉపరాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని ఆ మూడు ఆలయాల వద్ద పోలీసు అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

తిరునల్లారుకు పోటెత్తిన భక్తులు

పుదుచ్చేరి, జనవరి 28: పుదుచ్చేరి రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తిరునల్లారు దర్భారణేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. శనీశ్వరుడు కొలువై ఉన్న ఈ క్షేత్రంలో గత డిసెంబరు 20వ తేది శనిపెయర్చి ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు రోజులు వరుస సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచి తిరునల్లారు ఆలయానికి భక్తులు తరలివెళ్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం సమీపంలో ఉన్న వీధులు, మాడవీధుల్లో దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. నలన్ తీర్థ కొలనులో స్నానమాచరించిన అనంతరం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు.శని, ఆదివారాల్లో సుమారు లక్షమందికి పైగా భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఉచిత యోగా శిక్షణా తరగతులు

పెరంబూర్, జనవరి 28: సత్యానంద యోగా సెంటర్ ఆధ్వర్యంలో మూడు వారాలు ఉచిత యోగా శిక్షణ తరగతులు జరగనున్నాయి. వేళచ్చేరిలోని తిరువీధి అమ్మన్ ఆలయంలో ఫిబ్రవరి 4వ తేది నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు నిర్వహించనున్న ఈ తరగతుల్లో పాల్గొనేందుకు నెం.7871 715152, 9445051015లలో సంప్రదించవచ్చు.

3న అన్నా సమాధి వద్ద ఎడప్పాడి నివాళి

ఐసిఎఫ్, జనవరి 28: దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నా 55వ వర్థంతి సందర్భంగా ఫిబ్రవరి 3వ తేది ఉదయం 10.30 గంటలకు మెరీనా తీరంలో ఉన్న ఆయన సమాధి వద్ద అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నివాళి అర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పార్టీ ప్రధాన కార్యాలయం పేర్కొంది.

ముట్టుకాడు పడవ సవారీ రద్దు

ఐసిఎఫ్, జనవరి 28: ముఖద్వారంలో నీరు ఇంకిపోవడంతో ముట్టుకాడు పడవ సవారీని తాత్కాలికంగా నిలిపివేశారు. స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ముట్టుకాడు ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వ పర్యాటక శాఖ బోట్ హౌస్ నిర్వహిస్తోంది. పర్యాటకుల కోసం మోటరు పడవలు, పెడలింగ్ పడవలు, స్కూటర్లు వంటివి అందుబాటులో ఉన్నాయి. భారీవర్షాల అనంతరం వాతావరణ మార్పుల కారణంగా ఎన్నడూ లేని విధంగా ముట్టుకాడు ముఖద్వారంలో నీరు ఇంకి అక్కడక్కడా ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా పడవ సవారీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.


రూ.17,930 కోట్లతో
చెన్నై - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రోడ్డు

ఐసిఎఫ్, జనవరి 28: చెన్నై - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణ పనులు రూ.17,930 కోట్లతో జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. భారత్ మాల పథకం కింద 243 కి.మీ కర్ణాటకలోను, 45 కి.మీ తమిళనాడులోను రహదారి నిర్మాణపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు మీదుగా సాగే ఈ రహదారి ఎనిమిది మార్గాలు కలిగి ఉంటుందని, 90 శాతం పనులు పూర్తికాగా, మార్చి ఆఖరులోపు రహదారి రాకపోకలకు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

3న డీఎంకే శాంతి ర్యాలీ

పెరంబూర్, జనవరి 28: దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై 55వ వర్థంతి సందర్భంగా ఫిబ్రవరి 3వ తేది డీఎంకే ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ నేతృత్వంలో ఈ ర్యాలీ జరుగనుంది. స్థానిక వాలాజా రోడ్డులోని అన్నా విగ్రహం నుంచి మెరీనా తీరంలోని అన్నా సమాధి వరకు ర్యాలీ సాగనుంది. తొలుత ఉదయం 7 గంటలకు కామరాజర్ రోడ్డులోని అన్నా విగ్రహానికి పార్టీ నేతలు, మంత్రులు పూలు చల్లి నివాళి అర్పిస్తారని పార్టీ తెలిపింది.

సిప్ అర్థమెటిక్ జీనియస్ కాంటెస్ట్



విద్యార్థికి నగదు బహుమతి ప్రదానం

అడయార్, జనవరి 28: సిప్ ఆల్ ఇండియా అర్థమెటిక్ జీనియస్ కాంటెస్ట్ గ్రాండ్ ఫినాలే ఆదివారం చెన్నైలో జరిగింది. దేశవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి 6 లక్షల మంది పాల్గొనగా, 252 మందిని ఫైనల్‌కు ఎంపిక చేశారు. గిండీలోని ఒక నక్షత్ర హోటల్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ రీజినల్ డిప్యూటీ కమిషనర్ (నార్త్) రవి తేజా కట్టా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయన్నారు. సిప్ అకాడమీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను బహూకరించారు.

మా పాలనలో సాగుజలాల కొరతే లేదు

● ఎడప్పాడి పళనిస్వామి



ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే పదేళ్ల పాలనలో డెల్టా రైతులకు సాగుజలాలను సక్రమంగా సరఫరా చేశామని, ఏ ప్రాంతంలో కొరత లేకుండా రైతులను ఆదుకున్నామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. ఆదివారం ఉదయం ఆయన తంజావూరు జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో నిమిత్తం శనివారం రాత్రి చెన్నై నుంచి విమానంలో తిరుచ్చికి వెళ్లారు. తిరుచ్చి నుంచి కారులో తంజావూరు చేరుకున్న ఈపీఎస్‌కు ఆ జిల్లా సరిహద్దు ప్రాంతమైన సెంగిపట్టిలో పార్టీ ప్రముఖులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈపీఎస్‌పై పూలవర్షం కురిపించారు. వల్లమ్ కూడలి వద్ద మాజీ మంత్రి కామరాజ్, పార్టీ జిల్లా శాఖ కార్యదర్శి ఎం.శేఖర్ తదితరులు ఆయన్ను స్వాగత సత్కారాలతో ముంచెత్తారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో 65 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభంపై పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలోనే డెల్టా రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం డెల్టా రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, ఆ రైతాంగానికి కావేరి నదీ జలాలను నిర్ణీత పరిమాణంలో సరఫరా చేయలేకపోయిందని విమర్శించారు. ఒరత్తనాడు, పట్టుకోట, తిరునల్లూరు, పాపనాశం తదితర ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



చెన్నై టీటీడీ ఆలయంలో ఆదివారం సాయంత్రం అద్వితీయ సంగీత గేయధార నిర్వహించిన డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్రను, ప్రాశ్నికులను సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి, మోహన్‌రావు, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, రాధాకృష్ణ తదితరులు

చెన్నిమలై ఆలయ రథోత్సవం....
పోలీసు అధికారులకు ఘనసత్కారం



చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా చెన్నిమలై మురుగన్ ఆలయ తైపూస రథోత్సవంలో స్థానిక పోలీసు అధికారులను సత్కరించే ఆచారం శతాబ్దాల తరబడి కొనసాగుతోంది. రథం బయలుదేరడానికి ముందు, రథం రథ మండప ప్రాంతానికి చేరిన తర్వాత పోలీసుస్టేషన్‌లోని సీఐ, ఎస్‌ఐ సహా సిబ్బందిని మంగళవాయిద్యాల నడుమ పూలమాలలు వేసి ఊరేగిస్తుంటారు. పోలీసులను గౌరవించే ఈ ఆలయ మర్యాదలు వందేళ్లదాటినా కొనసాగిస్తుండటం విశేషం. ఆ మేరకు ఆలయ రథోత్సవం సందర్భంగా చెన్నిమలై సీఐ సెంథిల్‌బాబు తదితరులను మంగళవాయిద్యాల నడుమ రథ వీధుల్లో ఊరేగించారు.

సీతారాములకు తిరుమంజన వైభవం



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

ప్యారీస్, జనవరి 28: స్థానిక షావుకారుపేట తాతా ముత్తయప్పన్ వీధిలో సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారామ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రేష్ఠ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు తిరుమంజనం, 10 గంటలకు నూతన పట్టువస్త్రాల సమర్పణ, 10.30 గంటలకు అలంకారం, 11 గంటలకు హనుమత పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని నిర్వహించిన ఈ పూజల్లో ముఖ్యఅతిథిగా జయవరం చంద్రశేఖర్, వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్‌కుమార్, కార్యదర్శి ఉప్పుటూరు రవిచంద్రన్, బోర్డు మెంబర్లు, వలంటీర్లు పాల్గొని సీతారాములను భక్తిశ్రద్ధలతో సేవించారు.

రెండు నెలల్లో 53 వేల కనెక్షన్లు

ఏజీ అండ్ పీ ప్రథమ్



ప్రసంగిస్తున్న అనిల్‌కుమార్ జైన్

అడయార్, జనవరి 28: నేషనల్ పీఎన్‌జీ డ్రైవ్ కింద వచ్చే రెండు నెలల్లో 53 వేల కనెక్షన్లు ఇచ్చేందుకు ఏజీ అండ్ పీ ప్రథమ్ చేతులు కలిపాయి. ఈ డ్రైవ్‌ను పీఎన్‌జీఆర్‌బీ చైర్‌పర్సన్ డాక్టర్ అనిల్‌కుమార్ జైన్ ప్రారంభించారు. ఈ కనెక్షన్లను పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆధ్వర్యంలో పీఎన్‌జీ చేపట్టగా, ఇందుకోసం ఏజీ అండ్ పీ ప్రథమ్ చేతులు కలిపాయి. ఒక్క తమిళనాడులో ఈ యేడాది ఆఖరు నాటికి 10 వేల కనెక్షన్లు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. కాంచీపురంలో ప్రారంభించిన డ్రైవ్‌లో అనిల్‌కుమార్ జైన్‌తో పాటు ఏజీ అండ్ పీ ప్రథమ్ మేనేజింగ్ డైరెక్టర్ అభినేష్ గుప్తా, ఒసాకా గ్యాస్ ప్రతినిధి అత్సునోరి అకసోబే, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...
ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం

నారాయణవనం, జనవరి 28: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు తమిళ శ్రీవారి భక్తులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన తిరుపతి జిల్లా నారాయణవనం మండలం రాళ్ల కాలవ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ పరమేశ్‌నాయక్ కథనం మేరకు.... తమిళనాడుకు చెందిన మోహన్, వరదన్ శ్రీవారి దర్శనం కోసం కాలినడకను తిరుమలకు బయలుదేరారు. ఆదివారం ఉదయం రాళ్ల కాలవ వద్ద వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్ అక్కడిక్కడే మృతి చెందగా, వరదన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ఆరు జిల్లాల కలెక్టర్ల సహా
12మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

పెరంబూర్, జనవరి 28: చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ సహా 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా ఉత్తర్వులు జారీచేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.భాస్కర పాండ్యన్	కలెక్టర్, తిరుపత్తూర్	కలెక్టర్, తిరువణ్ణామలై
డా.ఆర్.బృందా దేవి	డైరెక్టర్, ఉద్యానవన శాఖ	కలెక్టర్, సేలం
కె.తర్పగరాజ్	డిప్యూటీ సెక్రటరీ, ఉన్నత విద్య	కలెక్టర్, తిరుపత్తూర్
ఏకే కమల్‌కిషోర్	డైరెక్టర్, దివ్యాంగుల సంక్షేమం	కలెక్టర్, తెన్‌కాశి
ఎస్.అరుణ్‌రాజ్	ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్	కలెక్టర్, చెంగల్పట్టు
వీఆర్ సుబ్బులక్ష్మి	జాయింట్ కమిషనర్, కమర్షియల్ టాక్స్, చెన్నై	కలెక్టర్, వేలూరు
బి.మురుగేష్	కలెక్టర్, తిరువణ్ణామలై	డైరెక్టర్, వ్యవసాయ శాఖ
పి.కుమరవేల్ పాండ్యన్	కలెక్టర్, వేలూరు	డైరెక్టర్, ఉద్యానవన శాఖ
డి.రవిచంద్రన్	కలెక్టర్, తెన్‌కాశి	డిప్యూట సెక్రటరీ, ఉన్నత విద్య
ఎం.లక్ష్మి	డైరెక్టర్, స్టేషనరి అండ్ ప్రింటింగ్	డైరెక్టర్, దివ్యాంగుల సంక్షేమం
జి.ప్రకాష్	అడిషినల్ కమిషనర్, రెవెన్యూ	నిర్వహణ కమిషనర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్
డా.ఎస్.నటరాజ్	కమిషనర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్	అడిషినల్ కమిషనర్, రెవెన్యూ నిర్వహణ

మధ్యలోనే తెగిపడిన పార్టీ పతాకం

అరిష్టాలు తొలగి మంచి రోజులు ● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



తెగిపడుతున్న పార్టీ జెండా - మీడియాతో మాట్లాడుతున్న ప్రేమలత

పెరంబూర్, జనవరి 28: డీఎండీకే కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించిన పార్టీ పతాకం మధ్యలోనే తాడు తెగి కింద పడడంతో కార్యకర్తల్లో ఆందోళన రేపింది. ఈ అంశంపై పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత... జెండా కిందపడడంతో అరిష్టాలు తొలగి మంచి రోజులు రానున్నాయని సముదాయించారు. డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ అనారోగ్యం కారణంగా గత నెల 28వ తేది మృతిచెందిన విషయం తెలిసిందే. అధ్యక్షుడు మృతిచెందడంతో పార్టీ పతాకాలను అవనతం చేయాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో, విజయకాంత్ మృతిచెంది 30 రోజులు కావడంతో, రాష్ట్రవ్యాప్తంగా అవతనం చేసిన జెండాలను ఆదివారం ఎగురవేయాలని పార్టీ పిలుపునిచ్చింది. ఆ ప్రకారం, కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ప్రేమలత పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పతాకం మధ్యలో తాడు తెగి కిందకు పడింది. ఖంగుతిన్న నేతలు, మళ్లీ సరి చేసి పతాకాన్ని ఎగురవేశారు. విజయకాంత్ స్మారక మండపం పనులు, నిరంతరం అన్నదానంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రేమలత తెలిపారు.

జమిలి ఎన్నికలకు మద్దతిచ్చిన కరుణ

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



పెరంబూర్, జనవరి 28: 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' ప్రక్రియకు దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి అప్పట్లో మద్దతు తెలిపారని, కానీ ఆయన ఆలోచన కుమారుడికి తెలియడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చెప్పుకొచ్చారు. తిరుచ్చిలో జరిగిన వీసీకే మహానాడు ఎప్పటిలాగే ఇజ్రాయేల్, పాలస్తీనా, మణిపూర్, శ్రీలంక తదితర ఇతర దేశాలు, గవర్నర్ పదవి అంశాలపై ఆ పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంబంధం లేని అంశాలపై ప్రసంగించడం ఎందుకో ఆయన తెలుసుకోవాలన్నారు. వేంగైవాయల్ వ్యవహారం జరిగి 14 నెలలు దాటిందని, అయినా నిందితులను పట్టుకోలేక పోయారన్నారు. రాష్ట్రంలోని 37 జిల్లాలో కులవివక్ష అధికంగా ఉందన్నారు. యేటా ఎన్నికలు జరుగుతుండడంతో పాలనా వ్యవహారంలో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కేంద్రమంత్రులుగా 76 మంది ఉండగా, వారిలో 16 శాతం అంటే 12 మంది దళిత వర్గానికి చెందిన వారున్నారని, కానీ రాష్ట్రంలోని 35 మంది మంత్రుల్లో ముగ్గురు మాత్రమే, అంటే 10 శాతం లోపే ఉన్నారని అన్నామలై తెలిపారు.

ఒక్క అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేస్తాం

● మదురై సభలో పీఎంకే ఎంపీ అన్బుమణి



మహానాడులో ప్రసంగిస్తున్న అన్బుమణి

ప్యారీస్, జనవరి 28: పరిపాలించేందుకు పీఎంకేకు ఐదేళ్ల అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలోకి నడిపిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రజలను కోరారు. మదురైలో నాడార్ మహాజన సంఘ 72వ మహానాడులో ఆదివారం ముఖ్యఅతిథిగా అన్బుమణి హాజరయ్యారు. తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో కురిసిన భారీవర్షాలకు ధ్వంసమైన రోడ్లకు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదని, రెండు ప్రధాన రహదారుల్లో మాత్రమే రాకపోకలు అనుమతించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. చెన్నైలో నీటిని రెండు రోజుల్లోనే తొలగించారని, అయితే దక్షిణ రాష్ట్రాలను డీఎంకే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతగా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పిన కామరాజర్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేశారని, ఆయన తీసుకొచ్చిన నీటి పథకాల వల్లే ప్రజలు, రైతులు ఇప్పటికీ లబ్ధి పొందుతున్నారని చెప్పారు. కామరాజర్ తర్వాత ప్రజలకు లబ్ధిచేకూర్చే పథకాలు ఏ ప్రభుత్వాలు చేపట్టలేదని, అలాంటి పథకాలు మళ్లీ తీసుకురావడానికి పీఎంకేకు ఐదేళ్లు పాలించే అధికారాన్ని అప్పగించాలని ఆయన సభాముఖంగా ప్రజలను కోరారు.

తిరువళ్లూర్ సమీపంలో కోళ్ల పందేల సందడి



ప్యారీస్, జనవరి 28: తిరువళ్లూర్ సమీపంలోని తంగనూరు గ్రామంలో తైపూసం సందర్భంగా న్యాయస్థానం జారీచేసిన నిబంధనలు పాటిస్తూ పోలీసుల సమక్షంలో శనివారం చేపట్టిన కోళ్ల పందేలు ఆదివారం ముగిశాయి. ఇందుకోసం ఆ గ్రామంలో ఏర్పాటుచేసిన బరిలో నూరి, కదర్, జావా, యాకూద్, గీరి, బీలా తదితర పందెం పుంజులు పౌరుషంగా ఢీకొన్నాయి. యజమానులు మొత్తం 122 పుంజులను బరిలో దింపారు. ఈ పందెంలో పాల్గొనేందుకు ఫీజు నిర్ణయించడంతో పాటు పోటీ ఒక్కొక్క రౌండ్‌కు 20 నిమిషాలు కేటాయించారు. పందేలను వీక్షించేందుకు తిరువళ్లూర్ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో తంగనూరులో సందడి నెలకొంది. పోటీల్లో గెలుపొందిన కోడిపుంజుల యజమానులకు కమిటీ నిర్వాహకులు విలువైన బహుమతులు అందజేశారు.

ఈపీఎస్ లేని అన్నాడీఎంకే : ఓపీఎస్

పెరంబూర్, జనవరి 28: ఎడప్పాడి పళనిస్వామి లేని అన్నాడీఎంకేను కార్యకర్తలు కోరుకుంటున్నారని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. దిండుగల్‌లో శనివారం అన్నాడీఎంకే కార్యకర్తలను తిరిగి రక్షించే కమిటీ కార్యకర్తలతో పన్నీర్‌సెల్వం భేటీ అయ్యారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ... అన్నాడీఎంకేను రక్షించి త్వరలో కోటపై జెండా ఎగురవేస్తామన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానిగా మోదీ ఎంపిక తథ్యమన్నారు. అన్నాడీఎంకేను విచ్ఛిన్నం చేసిన పళనిస్వామి, నాలుగేళ్ల అనంతరం బీజేపీ నుంచి వైదొలిగిన రాజకీయ ద్రోహానికి పాల్పడ్డారని విమర్శించారు. అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం, శశికళను చేర్చుకొని ఎన్నికల్లో పోటీచేస్తే గెలుపు సులభతరం అవుతుందని కేంద్ర మంత్రి అమిత్ షా... పళనిస్వామికి తెలిపారని, అందుకు ఆయన అంగీకరించలేదన్నారు. కొద్దిరోజుల్లోనే ఈపీఎస్ లేని అన్నాడీఎంకే సాక్షాత్కరిస్తుందని ఓపీఎస్ తెలిపారు.

ఓపీఎస్‌పై ఫిర్యాదు...

దిండుగల్‌లో మద్దతుదారుల సమావేశంలో పాల్గొన్న ఓపీఎస్ అన్నాడీఎంకే పతాకం వినియోగించినట్లు ఆ పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్నాడీఎంకే జెండా, చిహ్నం, లెటర్ పాడ్ వినియోగంపై ఓపీఎస్‌కు హైకోర్టు నిషేధించిన విషయం తెలిసిందే.

నేడు అన్నాడీఎంకే
సీట్ల సర్దుబాటు కమిటీ సమావేశం

పెరంబూర్, జనవరి 28: కూటమి పార్టీలకు కేటాయించిన సీట్లపై చర్చించేందుకు సోమవారం అన్నాడీఎంకే సమావేశం కానుంది. పార్లమెంటు ఎన్నికలకు ఇంకా కొన్ని నెలలే ఉండడంతో రాజకీయ పార్టీల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. అన్నాడీఎంకే ఏర్పాటు చేసిన సీట్ల సర్దుబాటు కమిటీ తొలి సమావేశం సోమవారం జరగనుంది. కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, ఎస్పీ వేలుమణి, తంగమణి, బెంజిమెన్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వీరు పార్టీలతో కూటమి, సీట్ల సర్దుబాటుపై చర్చించనున్నారు. కాగా, గత వారం మేనిఫెస్టో కమిటీ తొలి సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే.

వీఐటీ వర్సిటీ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతుల ప్రదానం



వేలూరు, జనవరి 28: వీఐటీ యూనివర్సిటీలోని గణిత శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ... విద్యార్థులకు మిగతా పాఠాలకన్నా గణితం చాలా ముఖ్యమైందన్నారు. జీవితంలో అన్ని స్థాయిల్లో గణితం అవసరమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, జీవీ సెల్వం తదితరులు పాల్గొనగా, డీన్ అరుణ నంబిరాజ్ అతిథులకు ఆహ్వానం పలికారు. గణిత శాఖ అధ్యక్షుడు జగదీష్‌కుమార్ గణిత పోటీల గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బు, గౌరవ అతిథిగా యూనివర్సిటీ మాజీ విద్యార్థిని, బెంగళూరు ఇస్రో శాస్త్రవేత్త లక్ష్మీ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ కాంచన భాస్కరన్, వైస్, ప్రో ఛాన్సలర్ పార్థసారథి మల్లిక, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నందిని, గౌరీశంకర్ పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈశ్వరమూర్తి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

రైలులో సీటు కోసం ఘర్షణ

● ఒకరి అరెస్ట్

పెరంబూర్, జనవరి 28: రైలులో సీటు కోసం జరిగిన ఘర్షణలో ఇద్దరిపై కత్తితో దాడిచేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్తున్న బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం రాత్రి అరక్కోణం సమీపంలో సీటు కోసం ముగ్గురు యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆవేశం చెందిన ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రైలు అరక్కోణం చేరుకున్న తరువాత దాడిలో గాయపడిన రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పండిమీనా (30), సామిసింగ్ (25)లను రైల్వే పోలీసులు అరక్కోణం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి చేసిన అరక్కోణానికి చెందిన మణివన్నన్ (29)ను అరెస్ట్ చేశారు.

గుడియాత్తంలో క్రికెట్ పోటీలు



క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, జనవరి 28: గుడియాత్తం కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను పుదియ నీతి కట్చి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసీ షణ్ముగం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంజీఆర్ యూనివర్సిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, జాయింట్ రిజిస్ట్రార్ మణివన్నన్, జిల్లా సెక్రటరీ సెంథిల్, నగర సెక్రటరీ రమేష్, ఆర్గనైజర్ మహేంద్రన్, రాజ్‌కుమార్, డాక్టర్లు చంద్రు, మహాలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడా ఉపకరణా లను ఏసీ షణ్ముగం అందజేశారు.

త్వరలో కులశేఖరపట్టినం రాకెట్ కేంద్రం సిద్ధం

● ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

ప్యారీస్, జనవరి 28: తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలో త్వరలోనే రాకెట్ ప్రయోగ కేంద్ర నిర్మాణ పనులు పూర్తవుతాయని ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. విరుదునగర్ జిల్లా రాజపాళయంలో జరిగిన విద్యార్థుల ఇష్టాగోష్ఠిలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రాంగణాన్ని ఆయన ఆదివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... విద్యకు ప్రాధాన్యం కల్పించిన రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాగలుతున్నారని, ప్రధానంగా భారత అంతరిక్ష కేంద్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. గగన్‌యాన్ పథకం దేశ చరిత్రలో అతిపెద్ద మైలురాయిగా నిలిచిందని, మానవులను అంతరిక్షంలోకి పంపించేందుకు ఈ పథకం సహకరిస్తుం దన్నారు. ఈ ఏడాది భారత్‌కు గగన్‌యాన్ సంవత్సరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

వేలూరు, జనవరి 28: కేవీ కుప్పం సమీపం మేల్‌మాయిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జ్యోతినాథన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా సమాజ సేవకుడు దినేష్ శరవణన్ పాల్గొని, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో 100కు పైగా మొక్కలు నాటగా, మొక్కలు సంరక్షిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

పుదుచ్చేరిలో కాంగ్రెస్సే పెద్ద పార్టీ

● మాజీ సీఎం నారాయణస్వామి

పుదుచ్చేరి, జనవరి 28: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో మిగతా పార్టీల కంటే కాంగ్రెస్ నెంబర్ వన్ స్థానంలో ఉందని మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు ఆటంకం కలిగించే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అబద్ధాలు చెప్పడంలో దిట్ట అని, దేశ చరిత్రను వక్రీకరిస్తూ ఆయన మాట్లాడడం సరికాదన్నారు. పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న ఎన్నార్ కాంగ్రెస్ ఎన్నికల హామీలను సక్రమంగా నెరవేర్చకుండా ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తోందని, ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి బలం నిరూపించుకోలేదని, పలుమార్లు అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ పార్టీయే ఎప్పటికీ నెంబర్ వన్ స్థానంలో ఉందని నారాయణస్వామి తెలిపారు.

ఒకే పంచాయతీలో ఇద్దరికి 'పద్మశ్రీ' పురస్కారాలు



పత్తిరప్పన్

పెరంబూర్, జనవరి 28: ఒకే పంచాయతీలో ఇద్దరికి 'పద్మశ్రీ' పురస్కారాలు వరించాయి. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం సమీపం తేకంపట్టి పంచాయతీ పరిధిలోని దాసనూరుకు చెందిన పత్తిరప్పన్(87) గ్రామీణ కళాకారుడు. తన 15వ ఏటనే గ్రామీణ కళలు నేర్చుకున్న ఆయన, 60 ఏళ్లుగా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, మహిళలకు 'వెల్లి కుమ్మి' గ్రామీణ కళను ఉచితంగా నేర్పిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన ఓ చిన్న ఇంట్లో నివసిస్తున్నాడు. రెండు గేదెలను సంరక్షిస్తూ, వాటి పాలు విక్రయించి వచ్చే ఆదాయంతో జీవిస్తున్నాడు. సాధారణ జీవితం జీవిస్తున్న గ్రామీణ కళాకారుడు పత్తిరప్పన్‌కు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. ఆయనకు పద్మశ్రీ పురస్కారం రావడంపై దాసనూరు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు, మేట్టుపాళయం సమీపం తేక్కంపట్టి గ్రామానికి చెందిన సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న పాపమ్మాళ్ (107)కు 2021లో కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారం అందజేసింది. ఒకే పంచాయతీకి చెందిన ఇద్దరికి పద్మశ్రీ పురస్కారం లభించడం దేశంలో మరేదైనా రాష్ట్రంలో జరుగుతుందా అనేది సందేహమే...!

ఉపాధ్యాయుల నిరాహారదీక్ష

వేలూరు, జనవరి 28: తమిళనాడు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ల సాధన కోసం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఆదివారం నిరాహారదీక్ష జరిగింది. సంఘ ఆర్గనైజర్ సత్యకుమార్ నేతృత్వంలో సాగిన దీక్షను జిల్లా సెక్రటరీ శ్రీనివాసన్ ప్రారంభించారు. దీక్షలో సంఘ నిర్వాహకులు రంజన్, దయాళదాస్, కుప్పురామన్, సరస్వతి సహా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పదోన్నతులు కల్పించాలని, వేతనాలు పెంచాలని, పాఠశాల నిర్వాహ కమిటీ సమావేశం ఏడాదికి నాలుగు సార్లు నిర్వహించాలంటూ నినాదాలు చేశారు.

నవ్వించేందుకే సినిమాల్లోకి వచ్చాను

● హీరో సంతానం

నవ్వించడానికి మాత్రమే సినిమాల్లోకి వచ్చాననీ, ఏ ఒక్కరినీ నొప్పించడానికి రాలేదని హీరో సంతానం స్పష్టం చేశారు. ఈయన హీరోగా నటించిన కొత్త చిత్రం 'వడకుప్పట్టి రామస్వామి' చిత్రం టైటిల్, పాత్రపై వివాదం నెలకొంది. శనివారం చెన్నైలో జరిగిన ఈ చిత్ర ఆడియో, ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఈ వివాదానికి తెరదించారు. సంతానం మాట్లాడుతూ, 'డీడీ రిటర్న్స్ కోణంలో మరో హాస్య భరిత చిత్రంలో నటించి, హిట్ ఇవ్వాలని ఆశపడ్డా. అలా తెరకెక్కించిందే ఈ సినిమా. ఏ ఒక్కరి మనసును గాయపరిచే సన్నివేశం ఇందులో లేదు. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తూ, కడుపుబ్బ నవ్వేలా ఉంటుంది. సీనియర్ హాస్య నటుడు గౌండమణి వీరాభిమానిని. ఆయన చిత్రంలో వచ్చిన ఓ డైలాగే ఈ చిత్ర టైటిల్. దాన్ని ఆధారంగా చేసుకునే కథను దర్శకుడు డెవలప్ చేశాడు. నేను, హీరో ఆర్య కలిసి ఒక చిత్రంలో నటించనున్నాం. అలాగే, ఆర్య నిర్మాణంలో నేనొక చిత్రంలో నటించనున్నా. మా ఇద్దరి గురించి ఇండస్ట్రీలోని ఫైనాన్షియర్లు అనేక రకాలుగా విమర్శలు చేస్తున్నారు. చివరగా బంగారు గుడ్లు పెట్టే ఒక బాతు వద్దకు నన్ను ఆర్య తీసుకెళ్లాడు. కానీ, ఆ బాతు గుడ్లు పెట్టలేదుకదా... మాకే రక్తం వచ్చింది. అది ఎవర్నది సస్పెన్స్' అని సంతానం అన్నారు. హీరో ఆర్య మాట్లాడుతూ... 'అభిమానులంటే సంతానంకు పిచ్చి. వారిని ఎల్లపుడూ సంతోషంగా ఉంచేందుకు తన వంతు ప్రయత్నిస్తుంటాడు. కార్తీక్ యోగి దర్శకత్వంలో ఓ అడ్వెంచర్ ఫాంటసీ కథలో నేను, సంతానం త్వరలో కలిసి నటించనున్నాం' అని తెలిపారు. దర్శకుడు కార్తీకి యోగి మాట్లాడుతూ... 'డిక్కిలోనా' చిత్రానికి ప్రేక్షకులు, సంతానం అభిమానులు ఇచ్చిన ఆదరణ వల్లే ఈ చిత్రానికి పునాది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం. నిర్మాత విశ్వప్రసాద్‌కు ధన్యవాదాలు. మళ్లీమళ్లీ సంతానంతోనే నేను సినిమాలు చేస్తా' అని అన్నారు. కాగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానరుపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించగా, సంతానం సరసన మేఘా ఆకాష్ హీరోయిన్‌గా నటించారు. సంగీతం షాన్ రోల్డన్. ఫిబ్రవరి 2వ తేదీన విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని శనివారం ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించగా, పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.


హీరో సంతానం - దర్శకుడు కార్తీక్ యోగి

మంచి చిత్రాలకు ఆదరణ లేదు

● దర్శకుడు మిష్కిన్


విలేకరులతో మాట్లాడుతున్న మిష్కిన్ తదితరులు

ఇపుడు మంచి చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ లేకపోవడం చాలా బాధగా ఉందని ప్రముఖ దర్శకుడు, సంగీత దర్శకుడు, నటుడు మిష్కిన్ ఆవేదన వ్యక్తం చేశారు. విదార్థ్, పూర్ణ నటించిన చిత్రం 'డెవిల్'. ఆదిత్య దర్శకుడు. ఈ సినిమాకు మిష్కిన్ సంగీతం సమకూర్చగా తాజాగా ఆడియో రిలీజ్ వేడుక జరిగింది. ఇందులో మిష్కిన్ మాట్లాడుతూ... ' నేను దర్శకత్వం వహించిన 'నందలాలా', 'ఓనాయుం ఆట్టుకుట్టియుం' చిత్రాల గురించి ఇపుడు మాట్లాడుతున్నారు. విడుదలైన సమయంలో ఈ చిత్రాలకు ఆదరణ లేదు. రాముడు ఒక అవతారం మాత్రమే. అయోధ్య రామాలయం విషయంలో రాజకీయాలు మాట్లాడను. నటి పూర్ణ నాకు తల్లి వంటిది. ఆమె కడుపున బిడ్డగా పుట్టాలన్నది నా కోరిక. నన్ను మరో వివాహం చేసుకోమని ఆమె సలహా ఇచ్చారు. నాకు ఒక కుమార్తె ఉంది. రెండో వివాహం చేసుకున్న వారు ఏ విధంగా కష్టపడుతున్నారు, వారి బాధలేంటో నాకు బాగా తెలుసు. ఈ చిత్ర దర్శకుడు ఆదిత్య నా తమ్ముడే. ఎన్నో కష్టాలు పడ్డాడు. అలా కష్టాలు అనుభవించిన వారు మంచి చిత్రాలను అందివ్వగలరు. ఈ చిత్రానికి నేను సంగీతం సమకూర్చాను. నటన, నేపథ్యగానం, దర్శకత్వం కంటే సంగీతంపై మక్కువ పెరిగింది. విజయ్ సేతుపతి నటించే చిత్రానికి దర్శకత్వం వహిస్తూనే సంగీతం సమకూర్చుతున్నాను' అని వివరించారు. కాగా, హెచ్ పిక్చర్స్ హరి, టచ్ స్క్రీన్ జ్ఞానశేఖర్ సంయుక్తంగా 'డెవిల్' చిత్రాన్ని నిర్మించగా, వచ్చే నెల రెండో తేదీన విడుదల చేయనున్నారు.

చిత్రజ్యోతి

'బ్లూస్టార్' అనుభవం వెరైటీగా ఉంది

● కెమెరామెన్ తమిళ్ ఏ.అళగు

అశోక్ సెల్వన్, సంతాను, పృథ్వీరాజ్, కీర్తిపాండ్యన్ నటించిన 'బ్లూస్టార్' చిత్రానికి ఛాయాగ్రాహణం అందించడం విభిన్నమైన అనుభూతిని ఇచ్చిందని ఆ చిత్ర కెమెరామెన్ తమిళ్ ఏ.అళగు తెలిపారు. 'బ్లూస్టార్' చిత్రానికి కెమెరామెన్‌గా పనిచేసిన అనుభవాలను ఆయన మీడియాకు వివరించారు. 'గతంలో నయనతార నటించిన 'ఓ2', అశోక్ సెల్వన్ నటించిన 'మన్మథలీలై'తో పాటు అనేక చిత్రాలకు కెమెరామెన్‌గా పనిచేశా. కానీ, బ్లూస్టార్‌కు పనిచేయడం కొత్త అనుభూతిని ఇచ్చింది. దీనికి కారణం ఈ చిత్ర కథ. అరక్కోణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 1990లో సాగే స్టోరీ. సెల్‌ఫోన్ టవర్, సాంకేతిక లేని సమయంలో క్రికెట్ పోటీలను ప్రత్యక్ష ప్రసారం చేయడం మరచిపోలేనిది. అరక్కోణంవాసుల్లో రైలు ముఖ్యమైన అంశం. అందుకే పలు సన్నివేశాల్లో రైలును చూపించాం. ఆ ప్రాంత జీవన చిత్రాలను సహజసిద్ధంగా చూపించాం. ప్రారంభం నుంచి ముగింపు వరకు అనేక రకాలైన క్రికెట్ మ్యాచ్‌లను చూపించాం. ఆ పోటీలను ఎమోషనల్‌గా స్టోరీకి కనెక్ట్ చేయడంతో ప్రేక్షకుల నుంచి స్పందన వస్తుంది. డిజిటల్‌లో ప్రసారం చేసినప్పటికీ ఈ చిత్రంలో అలాంటి ఫీలింగ్ ఎక్కడా కనిపించదు. అందుకే ఈ సినిమాకు పనిచేయడం కొత్త అనుభూతినిచ్చింది. నా తదుపరి ప్రాజెక్టు ఐశ్వర్యా రాజేష్ నటించే చిత్రం. అలాగే, మరి కొన్ని చిత్రాలకు పనిచేసే పనిచేసే విషయంపై సంప్రదింపులు జరుగుతున్నాయి' అని వివరించారు.



నటీనటులపై అపార నమ్మకం ఉన్న దర్శకుడు

● ఎస్.ఎళిల్‌పై దర్శకుల ప్రశంసలు ● 'దేశింగురాజా-2' ఫస్ట్‌లుక్ రిలీజ్


'దేశింగురాజా-2' ఫస్ట్‌లుక్

చిత్రపరిశ్రమలో ఒక వ్యక్తి 25 యేళ్ళుగా కొనసాగడం అదీ దర్శకుడిగా ఇప్పటికీ చిత్రాలకు దర్శకత్వం వహించడం అంటే సామాన్యమైన విషయం కాదని, దీనికంతటికీ కారణం ఆ దర్శకుడికి నటీనటుల నటన పట్ల ఉన్న అపారమైన నమ్మకమని పలువురు కోలీవుడ్ దర్శకులు అభిప్రాయపడ్డారు. అలా పాతిక సంవత్సరాలుగా దర్శకుడిగా రాణిస్తున్న ఎస్.ఎళిల్‌కు శనివారం రాత్రి అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో కోలీవుడ్ దర్శకులు కేఎస్ రవికుమార్, పేరరసు, ఆర్‌వీ ఉదయకుమార్, ఎస్.చంద్రశేఖర్, ఆర్‌కే సెల్వమణి తదితరులు పాల్గొని ఎస్.ఎళిల్‌ను అభినందనల వర్షంలో ముంచెత్తారు. ఎళిల్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'తుళ్లాద మనముం తుళ్లుం' విడుదలై పాతికేళ్లు అయ్యింది. విజయ్ - సిమ్రాన్ జంటగా నటించారు. ఆర్‌బీ చౌదరి నిర్మాత. ఈ చిత్రంలోని పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, క్లైమాక్స్, కామెడీ ఇలా ప్రతి అంశం హైలెట్ అని ఆ దర్శకులు పేర్కొన్నారు. పైగా దర్శకుడు ఎళిల్‌లో హాస్యం పాళ్లు అధికమన్నారు. ఇపుడు తెరకెక్కించే 'దేశింగురాజా-2'లో కూడా కామెడీ జోనర్‌లో ఉంటుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.పాతికేళ్లుగా ఆయన దర్శకుడిగా పనిచేయడం ఒకింత ఈర్ష్యగా కూడా ఉందన్నారు. నటీనటులను తనకు అనువుగా మార్చుకునే దర్శకుడు' అని దర్శకులు పేర్కొన్నారు. కాగా, ఎళిల్ దర్శకత్వం వహించే 'దేశింగురాజా- 2' చిత్రం ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. ఇన్ఫినిటీ క్రియేషన్స్ సమర్పణలో హీరో విమల్, హీరోయిన్లుగా పూజిత పొన్నాడ, హర్షిత నటించారు. ఈ సినిమాకు సంగీతం విద్యాసాగర్. సహ నిర్మాత ఆర్.బాలకుమార్, నిర్మాత పి.రవిచంద్రన్.


ఎస్.ఎళిల్‌కు దర్శకుల అభినందన

వీనుల విందుగా నాదోపాసన


వీణా వాయిద్య కచేరీ నిర్వహిస్తున్న డాక్టర్ చావలి శారద

వేళచ్చేరి, జనవరి 28: నగరంలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ సాంస్కృతిక విభాగం 'దుర్గాస్రవంతి' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు 'నాదోపాసన' కార్యక్రమం వీనుల విందుగా కొనసాగింది. డాక్టర్ చావలి శారద వీణా వాద్యం, ఎస్‌పి వసంతలక్ష్మి గానం చేసిన త్యాగరాజ కీర్తనలు శ్రోతలను అలరించాయి. మృదుల అఖండం తన కమ్మని కంఠంతో 'మాతెలుగు తల్లికి మల్లెపూదండ' అంటూ ప్రార్థనా గీతం ఆలపించారు. దామెర్ల సరస్వతి స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి ఎం.భార్గవి దేవేంద్రను నిర్వాహకులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దుర్గాబాయి దేశ్‌ముఖ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన పనిచేసిన సంస్థల గురించి వాటి ద్వారా తాను చేపట్టిన సమాజ సేవ గురించి తెలిపి ఈ తరం వారికి ప్రేరణ కలిగించారు. అనంతరం డాక్టర్ చావలి శారద 'నాద తనుమని శంకరం' (చిత్తరంజని రాగం) అనే త్యాగరాజ కీర్తనతో వీణా కచేరి ప్రారంభించారు. ఆమె వీణా నాదానికి శ్రోతలు ముగ్ధులయ్యారు. దేశాది తాళం, జయంత శ్రీరాగంలో 'మరుగేలరా ఓ రాఘవా' అంటూ శ్రుతి సుభగంగా వీణపై వినిపించారు. ఆదితాళం హంసనాదం రాగంలో 'బంటురీతి కొలువు ఈయవయ్య రామ' అనే త్యాగరాజకీర్తనకు శ్రోతలు హర్షధ్వానాలు చేశారు. చివరగా 'గంధము పూయరుగా పన్నీటి గంధము పూయరుగా' అనే కీర్తనతో ముగింపు పలికారు. శ్రోతల కోరికపై 'హిందోళ రాగం'లో 'సామజవరగమన' అనే కీర్తనను వీణపై వాయించి 'నీకాలి అందెల చిరు మువ్వ సవ్వడి చిరుజల్లు కురిసెనె లలితాయ' అంటూ తన కమ్మని గళంలో మృదు మధురంగా గానం చేశారు. ఆ తర్వాత ఎస్‌పి వసంతలక్ష్మి త్యాగరాజ కీర్తనలను ఆలపించి శ్రోతల ప్రశంసలందుకున్నారు. త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా దుర్గా స్రవంతి నిర్వహించిన 'నాదోపాసన' కార్యక్రమం శ్రోతలను ఆకట్టుకున్నది. దామెర్ల సరస్వతి వందన సమర్పణ గావించారు. దుర్గా స్రవంతి వారు ఏర్పాటు చేసిన విందు భోజనంతో కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.


దుర్గాబాయి దేశ్‌ముఖ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహనపై పరుగుల పోటీ


క్యాన్సర్ అవగాహన పరుగుల పోటీని ప్రారంభిస్తున్న నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్, కావేరి ఆసుపత్రుల గ్రూపు ఈడీ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినం పాటించనున్న సందర్భంగా ఆదివారం ఉదయం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పరుగులు పోటీని నిర్వహించారు. బిసెంట్‌నగర్‌లోని అల్కాట్ మెమోరియల్ హయ్యర్ సెకండరీ స్కూలులో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో 10 కి.మీల పరుగుల పోటీని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్, కావేరి ఆసుపత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ ప్రారంభించారు. 5 కి.మీల పరుగుల పోటీని గ్రేటర్ చెన్నై అసిస్టెంట్ పోలీసు కమిషనర్ మురుగేశన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో మేటి పరుగు పందెం క్రీడాకారులు, వివిధ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు, వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు సహా సుమారు 4700 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావేరి హాస్పిటల్ రేడియేషన్ అంకాలజీ డైరెక్టర్ ఏఎన్ వైద్యీశ్వరన్ మాట్లాడుతూ... తరచూ క్యాన్సర్ తీవ్ర రూపం దాల్చకముందే గుర్తిసే నయం చేయగలమని, ఈ విషయంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకే ఈ పరుగుల పోటీని నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడానికి కావేరి ఆసుపత్రులలో నవీన సాంకేతిక వైద్యపరికరాలతో అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన వైద్యచికిత్సలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

● నామక్కల్ - ఈరోడ్ జిల్లాల్లో

అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయసేకరణ

ఇన్‌ఛార్జులతో ఉదయనిధి చర్చలు

అడయార్, జనవరి 28: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై ఆయా జిల్లాల నాయకులతో డీఎంకే సీనియర్ నేతలు అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఎన్నికల పనులను పర్యవేక్షించేందుకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ మూడు కమిటీలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నెల 24న కృష్ణగిరి, తిరువళ్ళూరు, కోయంబత్తూరు, సేలం లోక్‌సభ స్థానాల నాయకులతో సమావేశమై, వారినుంచి క్షేత్రస్థాయిలోని సమాచారాన్ని సేకరించారు. అదేవిధంగా ఆదివారం మరోమారు సమావేశమైన ఈ కమిటీ... నామక్కల్, ఈరోడ్ లోక్‌సభ స్థానాలకు చెందిన నాయకులతో అన్నా అరివాలయంలో సమావేశమైంది. ఇందులో మంత్రి ఉదయనిధి పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. సీనియర్ మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, తంగం తెన్నరసు, ఉదయనిధి స్టాలిన్, పార్టీ సీనియర్ నేత ఆర్ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు.


నామక్కల్ జిల్లా పార్టీ నిర్వాహకులతో చర్చలు జరుపుతున్న మంత్రులు కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, ఉదయనిధి తదితరులు

త్వరలో కేజ్రీవాల్ కూడా బయటకు...

● త్రిపుర మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్



పెరంబూర్, జనవరి 28: బిహార్ ముఖ్యమంత్రి నీతీష్‌కుమార్ బాటలోనే ఆమ్ ఆద్మీ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా 'ఇండియా' కూటమి నుంచి వైదొలుగుతారని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేవ్ అన్నారు. స్థానిక టి.నగర్‌లో బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ 'విశ్వకర్మ' పథకంలో రెండో విడత శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడులో మాత్రమే 3.60 లక్షల మంది విశ్వకర్మ పథకంలో చేరారని తెలిపారు. కేంద్రప్రభుత్వ పథకాలకు రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో అన్నామలై నేతృత్వంలో బీజేపీ బలోపేతం అవుతోందన్నారు. డీఎంకేలో వారసులకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని, కానీ బీజేపీలో రేపటి రోజునే సాధారణ కార్యకర్త ముఖ్యమంత్రి అయ్యే అవకాశముందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపడుతుందని నమ్మకం వ్యక్తం చేశారు.



వేడుకల్లో అనితా రమేష్, లక్ష్మి కర్లపాటి, వసుంధర సుంకు తదితరులు

అలరించిన మహిళా సభ కార్నివాల్

ప్యారీస్, జనవరి 28: తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ మద్రాసు యూనిట్ ఆధ్వర్యంలో కార్నివాల్ వేడుకలు చెన్నైలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆళ్వార్‌పేటలోని యతిరాజ్ కల్యాణ మండపం వేదికగా ఉదయం ప్రార్థనాగీతం, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలు రాత్రి 8 గంటల వరకు వివిధ కార్యక్రమాలతో సందడిగా సాగాయి. మహిళా సభ మద్రాసు యూనిట్ ఛైర్‌పర్సన్ అనితా రమేష్ స్వాగతోపన్యాసం చేయగా, కార్యదర్శి కర్లపాటి లక్ష్మి వార్షిక నివేదిక సమర్పించారు. సంస్థ తరఫున గత సంవత్సరం అమలుపరచిన ప్రాజెక్టులు, ఈ నూతన సంవత్సరంలో చేపట్టనున్న ఆధ్యాత్మిక, సాంఘిక, సామాజిక సేవల గురించి ఆమె సభకు వివరించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌కేపీడీ ట్రస్టీ వి.శరత్‌కుమార్ హాజరై, మహిళా సభ నిర్వాహకుల సేవలు కొనియాడారు. అనంతరం కళాశాల విద్యార్థులు, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అలాగే, రామాయణం క్విజ్, తంబోలా, డ్రాయింగ్ తదితర పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్నివాల్‌లో మొత్తం 45 స్టాళ్లు, 9 ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. ట్రెజరర్ వసుంధర సుంకు, ఇతర సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు మద్రాసు యూత్ క్వయర్ బృందం అందించిన సినీ సంగీత కచేరి శ్రోతలను అలరించింది.

కిలో మల్లెపూలు రూ.4,600

ఐసిఎఫ్, జనవరి 28: పుంజైపుళియంపట్టి మార్కెట్లో మల్లెపూలు కిలో రూ.4,600లకు విక్రయమయ్యాయి. ఈ ప్రాంతం, భవానీసాగర్ పరిసర ప్రాంతాల్లో మల్లెపూలు, సన్నజాజులు, సంపంగి వంటి పూల సాగు జరుగుతోంది. ఈ పూలను పుంజైపుళియంపట్టి మార్కెట్‌కు రైతులు తరలిస్తుంటారు. అక్కడ ధర నిర్ణయించి రాష్ట్రంలోని వివిధ నగరాలకు సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం మంచు కారణంగా మల్లెపూల దిగుబడులు తగ్గాయి. ఈ నేపథ్యంలో, ముహూర్తాల సీజన్ ప్రారంభం కావడంతో పూల వినియోగం పెరిగింది. శుక్రవారం కిలో రూ.2,700 విక్రయం కాగా, శనివారం రూ.4,600లకు విక్రయమయ్యాయి. అలాగే, రూ.1,000కి విక్రయమైన జాజి పూలు రూ.2,000, సంపంగి కిలో రూ.50కు విక్రయమయ్యాయి.

ఆనైమలై అభయారణ్యంలో పక్షుల గణన ప్రారంభం


పక్షుల లెక్కింపు పనుల్లో అటవీశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లాలోని ఆనైమలై పులుల అభయారణ్యంలో అటవీశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, పక్షుల ప్రేమికులతో కలిసి పక్షుల గణన ప్రారంభించారు. చెరువులు, సరస్సులు, వాగులు తదితర ప్రాంతాల్లో యేటా పక్షుల గణన జరపడం ఆనవాయితీ. ఆ మేరకు ఆనమలై పులుల అభయారణ్యం, తిరుప్పూరు అటవీ ప్రాంతం, మరుళ్‌పట్టినం, పాప్పాన్‌కుళం, శెట్టియార్‌కుళం, పెరియకుళం, సెంగుళం, రాయ్‌కుళం, తేన్‌కుళం, చిన్న ఆండిపాళయం కుళం, సామనపురం, రమియంపాళయం, సంగమాంగుళం, నంజరాయన్ కుళం సహా సుమారు 20 ప్రాంతాల వద్ద పక్షుల గణన చేపడుతున్నారు. సరస్సుల వద్ద సంచరిచే పక్షులు, చెరువులు, వాటి సమీపంలో ఉన్న పొదల వద్ద ఉన్న పక్షులను లెక్కిస్తున్నారు. ఇదే విధంగా ఉడుమలై సర్కిల్‌లోని సెంగుండ్రం, పెరియకుళం ప్రాంతాల్లో అటవీశాఖ అధికారి శివకుమార్ నేతృత్వంలో పక్షులను లెక్కించారు.

పళని ఆలయంలో ముగిసిన తైపూస వేడుకలు

● చివరి రోజు పోటెత్తిన భక్తజనం


పళని ఆలయం వద్ద గుమికూడిన భక్తజనం

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరుదివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రంగా విలసిల్లుతున్న పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో ఆదివారం తైపూస ఉత్సవాలు తెప్పోత్సవంతో ముగిశాయి. ఆదివారం ఈ ఉత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు వేల సంఖ్యలో పోటెత్తారు. దీంతో ఉదయం నుండి సాయంత్రం వరకు పర్వతం దిగువ, పర్వతంపైనా భక్తుల సందడి అధికమైంది. దీనికితోడు వ్రతమాచరించిన భక్తులు నోటికి ఇరువైపులా శూలాలు గుచ్చుకుని, కావళ్లు మోసుకుంటూ పర్వతంపైనున్న దండాయుధపాణి స్వామి ఆలయానికి తరలివచ్చారు. ఈ ఆలయంలో తైపూస ఉత్సవాలు ఈనెల 19న పెరియనాయకి అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణంతో ప్రారంభమైన విషయం విదితమే. ఈనెల 25న రథోత్సవం కూడా అత్యంత వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్‌డే నుంచి వరుస సెలవులు రావటంతో ఈ ఆలయానికి భక్తుల రాక క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆదివారం జరిగిన తెప్పోత్సవాలకు కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొండదిగువ, గిరివీధి, ఏనుగు రహదారి, మెట్ల రహదారి, ఘాట్ తదితర ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఇక స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

ఐస్‌ల్యాండ్‌గా మారుతున్న ఊటీ

● చలికి వణకుతున్న పర్యాటకులు ● 1.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


ఊటీలో మొక్కలపై దట్టంగా అలముకున్న మంచు

పెరంబూర్, జనవరి 28: నీలగిరి జిల్లాల్లోని పలు ప్రాంతాలు తెల్లటి మంచు దుప్పటి కప్పుకుని దర్శనమిస్తున్నాయి. జిల్లాలో యేటా నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు మంచు కురిసే కాలంగా ఉంది. కానీ, ఈ ఏడాది తుఫాను, భారీవర్షాల కారణంగా మంచు కాలం ఆలస్యంగా ఈ నెలలో ప్రారంభమైంది. ఊటీ, కందల్, తలైకుంద తదితర ప్రాంతాల్లో మంచు తీవ్రత అధికంగా ఉంది. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. పర్యాటకులు సైతం ఉదయం 10 గంటల వరకు విడిదిగదులకే పరిమితమతున్నారు. ప్రజలు తీవ్రమైన చలి నుంచి రక్షించుకొనేలా మంటలు వేసుకుంటున్నారు. ఐస్‌ల్యాండ్‌గా మారిన ఊటీలో 1.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, గాలిలో తేమ 73 శాతంగా ఉండడంతో ప్రజలు చల్లటి వాతావరణంలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు అందిద్దాం

● 'వామ్ గ్లోబల్' అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ

ప్యారీస్, జనవరి 28: ప్రపంచ దేశాల్లోకెల్లా గొప్పదైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక చూలైమేడులోని వామ్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ చెన్నై మహిళా విభాగం, అన్నానగర్ మహిళా విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంబరాల్లో మహిళలు, చిన్నారులు జానపద గీతాలకు అనువుగా స్టెప్పులేసి అలరించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని నిర్వహించిన డాన్స్ ప్రతిభ పోటీల్లో గెలిచిన వారికి తంగుటూరి రామకృష్ణ-రమాదేవి దంపతులు బహుమతులు అందజేసి అభినందించారు. అలాగే, చిన్నారుల తలపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. శ్రీలత ఉపేంద్ర, అరుణ, రాణి హరినాద్, కృష్ణకుమారి పర్యవేక్షణలో సాగిన ఈ వేడుకలు తెలుగు సంస్కృతికి అద్దం పట్టాయి.


సంక్రాంతి సంబరాల్లో మహిళలు, చిన్నారులు, సభ్యులతో తంగుటూరి రామకృష్ణ